



# కాంతి కిరణం

'ఈశ్వరి'

'ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్' లోని కుడి వైపు ఛేంబర్ నుండి కాంభోజి రాగంలో ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మిగారి గానం ఎప్పుడు మధురంగా వినిపిస్తూంది. తన్మయత్వంతో కుర్చీలో వెనక్కువాలి, రికార్డ్ ప్లేయర్ ముందు కూర్చుని తాళం వేస్తూ వింటున్నారు జగన్మోహనరావుగారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా మంచి పేరు సంపాదించుకుని, అనుభవంలో జీవితాన్ని పండించుకున్న మహానుభావుడు ఆయన.

"అబ్బ! ఏమిటండీ, రావుగారూ! పరమ బోర్! కాస్త ఆ శాస్త్రీయ సంగీతం కట్టేసి, కాస్సేపు ఏవైనా మంచి శాస్త్ర విషయాలు చెప్పండి" అన్నాడు ఆయన దగ్గరగా వస్తూ అసిస్టెంట్ వర్క్స్ స్టడీ ఆఫీసర్ జగదీష్. అతని కెంత సేపూ ఎకనమిక్సూ, స్టాటిస్టిక్సూ తప్ప ఆర్టిస్టిక్ వ్యూస్ బహు తక్కువ.

"అయితే మీకు నచ్చే విషయం ఏదైనా చెప్పండి. చర్చిద్దాం." రికార్డ్ ప్లేయర్ ఆఫ్ చేస్తూ అన్నారు రావుగారు.

"ఈమధ్య మాగజైన్‌లో ఓమెన్— 2 చిత్రాల

## విషవల్లులు

జీవితపు శాఖల, ఆశయాల నందనంలో
అల్లిబిల్లిగా కల్లోలిగా ఆవరించి
ప్రగతి పరాగాన్ని పుక్కిలి బడుతున్నాయి
అసత్యపు విషవల్లులు, అభ్యుదయ వాటికి వీటి జల్లులు
ఈ వల్లుల మానులు భూ నభోంతరాళా నిండాయి
ఆకలితో దాహంతో ఊపిరాడక తహతహలాడే
చిన్నారి చైతన్య సుమతా మంత మొలకల్ని
మొదలంటా పెకలించి వేసినాయి । మా
న్యాయాల అద్యత నిండిన ఈ కల్మష వల్లులు
అభ్యుదయ గాములారా! అందరూ రండి
అభినవ శాఖాతంత్ర శక్తితో మన జీవిత నందన
వన కాణాచిని తీర్చిదిద్దుకుందాం. ధన్యులమే అవుదాం
మనీషి మనస్సుందరంగా, అభిజాత గంధవహంగా
తీర్చుకున్న ఈ తరుణోద్యాన వన సుమ సౌ
సౌరభా స్నానాలను చేసేదాం. పుణ్యాలను పొందుదాం.
విషవల్లుల ప్రభావాల విరిబూవిన
కల్మషా భావాలకు స్వస్తిచెప్పి ప్రగతి జగతి సాగుదాం.

— సుచంద్ర

చదివాను. ఒక కుర్రాడిని శాటర్న్ ఆవహించి, ఎంత భయంకరంగా అందరినీ హింసిస్తుందో అందులో ఉంది. శాస్త్ర విజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలోకూడా ఇలాంటి అభూత కల్పనలతో అశాస్త్రీయ విధానాలను ప్రచారం చేస్తూ, మూఢ విశ్వాసాలతో దెయ్యాలూ, దేవతలూ అనడం ఎంతవరకు సమర్థనీయం అంటారు?" అన్నాడు జగదీష్. "అంతేకాదు. 'ది ఎగ్జార్సిస్ట్' పిక్చర్‌కూడా అంతేనండి. ప్రేక్షకుల్లో ఉండే క్యూరియాసిటీని, సెక్స్‌ని కమర్షియలైజ్ చేస్తూ, జాతిని మరెంతో వెనక్కు తీసుకు వెళ్ళడం ఏం న్యాయం చెప్పండి?" అంతవరకూ 'బ్రిడ్జ్' ఆటలో మునిగి ఉన్న ప్రొఫెసర్ వెంకటరాఘవన్ ఆట మాని అతని మాటను అందుకుంటూ అన్నారు. జియో—ఫిజిస్ట్ సుభానికూడా అక్కడ చేరాడు.

"నిజమేనండీ! కాని అలా హేతువాదంతో తర్కించిన సోక్రటీసుని ఆ నాడు ఏం చేశారు? ఉరి తీశారు. ఈ నాడూ అంతే. నిజాన్ని నిజంగా పలకడం, నిర్భయంగా చెప్పడం నేరం." జీవితం నేర్పిన పాఠంతో అన్నారు రావుగారు.

"అలా అని ఎవరిమట్టుకు వారు 'మా కెందుకులే' అని ఊరుకోవడమేనాండీ? గ్రామానికో సంఘ సంస్కర్త చొప్పున బయలుదేరాలి." అంతవరకు ఉమెన్ సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసరు మిసెస్ నందినీ కులకర్ణితో ఛెస్‌బోర్డు దగ్గర కూర్చున్న రెవెన్యూ ఆఫీసర్ సుజాత తనుకూడా వచ్చి చర్చలో పాల్గొంటూ అంది.

"అవునండీ. మీ అభిప్రాయం మంచిదే. కాని 'సతి' దురాచారాన్ని రామమోహనరాయ్ పూర్తిగా మార్చగలిగాడా? మొన్నీ మధ్యనే బలవంతంగా ఒక స్త్రీ చేత సహగమనం చేయించారు. ప్రతి వ్యక్తి లోనూ మానసికంగా పరివర్తన ఏర్పడితేనే తప్ప, సంఘ సంస్కర్తలూ, చట్టాలూ ఏమీ చేయలేవు" అన్నారు రావుగారు ఆవేదనగా.

"రావుగారూ! మీకు ఢిల్లీ నుండి ట్రంక్ కాల్ ఏదో వచ్చిందండీ. మీ అబ్బాయనుకుంటాను మరి." డాక్టర్ సేథ్ వస్తూ అన్నారు.

"మీరు మాట్లాడుతూండండి. నేను వస్తాను" అంటూ వెళ్ళిపోయారు రావుగారు. ఆయన వెళ్ళి పోవడంతో అందరికీ నిరాశ కలిగింది. జగన్మోహన రావుగారి ఉపన్యాసంలో ఎన్నో విషయాలు దొర్లి పోతుంటాయి. షేక్స్‌పియర్, బెర్నార్డ్‌షా, హెచ్. జి. వెల్స్ దగ్గర నుండి అన్నసాని, గురజాడ వరకు, షెల్లీ, కీట్స్ దగ్గర నుండి శ్రీ శ్రీ, కృష్ణశాస్త్రి వరకు అనర్గళంగా ఒక్క సాహిత్యం గురించే కాదు, అన్ని రంగాల లోనూ ఉపన్యసించగల శక్తిమంతులు రావుగారు.

"సునీల్ గవాస్కర్ డబుల్ సెంచరీ చేశాడండీ. అబ్బ! ఏం అద్భుతంగా ఆడాడండీ! రెండవ ఇన్నింగ్స్‌లో 221 పరుగులు చేశాడు. రన్ గెటింగ్ మెషిన్‌గా పేరు తెచ్చుకున్న ఓపెనింగ్ బాట్స్‌మన్ కదండీ. ఏమైనా ఇండియా పేరు నిలబెట్టాడు." అప్పుడే క్రికెట్ కామెంటరీ విని వస్తున్న పార్థసారథి ఆ విజయం ఏదో తనే సాధించినట్టుగా సంతోషంతో కుర్చీలో చతికిల బడుతూ అన్నాడు.

"లోకో భిన్న రుచిః" అనుకున్నాడు దూరంగా కూర్చుని వారందరి మాటలు ఆసక్తిగా వింటున్న మధుమూర్తి.

అతనొక ఐ.ఎ.ఎస్. ఆఫీసరే కాకుండా రచయిత, కళాకారుడుకూడా. సుజాత అంటే అతనికి చాలా ఇష్టం. ఇద్దరివీ ఒకే అభిప్రాయాలు. దూరం నుండి ఉండి ఉండి సుజాత అతని వంక చూస్తోంది. ఆమె చూపుకి మధుమూర్తి గుండె ఝల్లుమంది. ఆమె నాగ చూపులో అనంతకోటి భావాలు. అతని మనస్సులో మధురమైన అనుభూతులు.

"మీరేమిటి? అంత మౌనంగా ఉన్నారు, మధుమూర్తిగారూ! అలా ఒక్కరూ దూరంగా కూర్చుండి పోయారేమిటి?" ఎంట్రన్సు గుమ్మం దగ్గరగా కూర్చుని, లాన్సు మధ్యగా ఉన్న ఫౌంటెన్‌లోంచి నీరు ఎత్తుగా పైకి చిమ్ముతుంటే అటు చూస్తూ, కవి 'వూహల్లో' ఉన్న మధుమూర్తిని చూసి నందినీ కులకర్ణి అంది.

"జగన్మోహనరావుగారు సతీసహగమనం గురించి ఘోరంగా చెప్పారు. కాని ఈ మధ్య అంతా పేపర్లో చదివే ఉంటారు. కట్నం తేలేదని ఒక యువతిని భర్త, అత్తగారు కలిసి సజీవ దహనం చేశారు. ఇది అంత కన్నా ఘోరం కదా అని ఆలోచిస్తున్నాను." పార్థసారథి పక్కనున్న కుర్చీలో వచ్చి కూర్చుంటూ అన్నాడు మధుమూర్తి.

"అవునండీ మధుమూర్తిగారూ! ఇవన్నీ చూస్తుంటే అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, ఉమెన్స్ లిబ్—అన్నీ నిద్ర పోతున్నాయా అనిపిస్తుందండీ. ఎందరు సంస్కర్తలు బయలుదేరినా, స్త్రీని పూర్తిగా లేవనెత్త గలిగారా? దురాచారాలను, మత మౌఢ్యాన్ని మాన్ప గలిగారా? సాటి మనిషికి కష్టంలో సాయం చేయని వాళ్ళు గుళ్ళో ఉన్న దేవునికి వేలు, లక్షలు ఖర్చు చేసి పూజలు జరిపిస్తూ, ముడుపులు చెల్లించగలరు. అతి విలువైన మానవ శక్తులను ప్రజాసంక్షేమానికి, మనిషి సుఖప్రద జీవనానికి వినియోగించుకోలేక, అడుగడుగునా అపనమ్మకంతో అమ్మవారికి నైవేద్యాలు, దేవునికి జంతుబలులు ఇస్తే అన్నీ నెరవేరుతాయని జీవితకాలాన్ని వృథా చేస్తూ, మానవ సేవలో వినియోగించడం మాని ఇలా వ్యర్థం చేసేవాళ్ళు ఎంతోమంది ఉన్నారండీ." ఆవేశంలో అంది సుజాత.

"అయితే నేను నిత్యం రోజుకు రెండు, మూడు గంటలపైనా దైవ పూజ చేస్తాను. అందుకని భగవంతుని నమ్మడం మూఢత్వమంటావా?" పార్థసారథి అన్నాడు.

"అలా అని కాదండీ నే అంటుంది. ఆధ్యాత్మిక వారసత్వ సంపద పుణికి పుచ్చుకున్న మన దేశంలో దైవ చింతన లేనివారు కోటికి ఒక్కరుకూడా ఉండరు. కాని గాంధీజీ రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణ మహర్షి—వీరంతా దైవాన్ని ఒక మహోత్తర దివ్యశక్తిగా ఆరాధించారు తప్ప మూఢ భక్తితో పరబ్రహ్మ స్వరూపాన్ని ఒక సామాన్య మానవుడుగా, అగ్రహహంకారాలు మూర్తీభవించిన స్వార్థ స్వభావుడుగా కొలవలేదు. ఏమంటారు మీరు?" దివ్య కాంతులు వెదజల్లే కళ్ళతో అపురూప సత్యాలను వెల్లడిస్తోంది సుజాత. అంతా సుజాతనే ఆసక్తిగా

చూస్తున్నారు. సుజాత చల్లని చిరునవ్వుతో అందరినీ మంత్రముగ్ధుల్ని చేస్తూ చాలా మాటిగా మాట్లాడు తుంది. సుజాత అంటే అందరికీ అతి గౌరవం. ఎంతో చనువుగా అందరితోనూ మసలుతూ, చాటున కూడా తన గురించి అసభ్యంగా చెప్పుకోవడానికి ఆస్కారం ఇవ్వని ఉన్నతమైన వ్యక్తిత్వం సుజాతది. నిజమైన సొఫిస్టికేటెడ్ లేడీ సుజాత! ఎటువంటి పరిస్థితిలోనూ చలించని మనస్తత్వం, ఉన్నతమైన ఆదర్శాలు, అత్యున్నత సంస్కారం కలిగిన విశిష్టమైన వ్యక్తిత్వం ఆమెది. వెన్న కంటె తెల్లగా, వెన్నెల కంటె చల్లగా ఉండే మంచిగంధం లాంటి మంచి మనసు. అమృతకలశం లాంటి విశాల హృదయం కలిగిన సుజాత ఒక మానవతావాది.

"అన్నట్లు ఈ రోజు రేడియో స్టేషన్‌లో మన 'కళాంజలి' వారిది ప్రోగ్రామ్ రికార్డింగ్ ఉంది. ఎవరికీ గుర్తు లేదనుకుంటాను. చర్చలో మునిగి పోయినా రంతా." జ్ఞాపకంచేస్తూ అన్నాడు పార్థసారథి. ఆ మాటతో అక్కడున్న కళాంజలి సభ్యు లంతా లేచారు సుజాత, మధుమూర్తితో పాటు.

* * *

రాత్రి 9 గంటలకు రికార్డింగు పూర్తయింది. ఎవరి కార్లలో వారు బయలుదేరుతున్నారు. మధు మూర్తి కారు గారేజీకి వెళ్ళింది. టాక్సీ మీద వెళదామనుకుంటుండగా "నా కారులో డ్రాప్ చేస్తాను, రండి" అంది సుజాత. "థాంక్ యూ" అంటూ డోర్ తీసుకుని ఫ్రంట్ సీటులో ఆమె పక్కన కూర్చున్నాడు మధుమూర్తి.

కారు అద్దాల లోంచి బయట చీకటి చాలా గంభీరంగా కనిపిస్తోంది. ఆ చీకటిని చీలుస్తూ ఉండి ఉండి ఎలక్ట్రిక్ దీపాలు మెరుపులు చిమ్ముతూ దేవకన్యలు ప్రత్యక్షమై మిలమిలా మాయమవు తున్నట్లు గిరగిరా తిరుగుతూ తప్పుకుంటున్నాయి. చీకటిలోని అంతటి అద్భుతమైన అందాన్ని చూస్తూ అనాలోచితంగా పక్కకి తిరిగి చూశాడు మధుమూర్తి. మామూలుగా కారు డ్రైవ్ చేస్తున్నది సుజాత. ఆ సన్నటి వెలుగులోకూడా ఆమె సౌందర్యం వింత కాంతులను వెదజల్లుతున్నది. అతని మనసు పులకించింది. సుజాతతో మనసు విప్పి మాట్లాడాలనిపించింది. ఆ భావం రాగానే అతని గుండె వేగంగా స్పందించింది.

"ఏమిటలా చూస్తున్నారు? ఏమైనా మాట్లాడండి." ఎప్పటిలా స్నిగ్ధమైన చిరునవ్వులు చిలుకుతూ మూర్తి వైపు చూసి అంది సుజాత.

"అబ్బే! ఏం లేదు. ఏం మాట్లాడమంటారు?" తడబడుతూ అన్నాడు మధుమూర్తి.

అతని మనసు గొంతుకలోనే చిక్కుకుంది. అంతవరకూ ఆమెతో ఏవేవో చెప్పాలనుకున్న వన్నీ కంఠంలోనే ఆగిపోగా, మధురమైన ఆ మూగ వూహలు ఎదలో రొదచేస్తూ ఉంటే 'ది అన్‌నోన్ మెలోడీస్ ఆర్ ఆల్వేస్ స్వీట్' అనుకున్నాడు మధుమూర్తి.

సుజాత తలలోని తెల్ల గులాబీ మధుమూర్తిని చూసి ఫక్కున నవ్వింది.

అతను తన మనసులోని మాట చెబితే బాగుండు ననుకుంటుంది సుజాత. చెప్పలేని భావాలు ఇద్దరి మధ్యా మధురిమ లొలికిస్తున్నాయి. ఇక కాస్సేపటిలో రెసిడెన్సీకి చేరుకుంటా రనగా సుజాత అంది:

"మీరు ఢిల్లీ కాన్ఫరెన్సుకి వస్తున్నారా?"

"ష్యూర్. రాకుండా ఎలా ఉంటాను?" తేజో వంతమైన ఆమె కళ్ళల్లోకి చూడలేక అతని చూపులు బెదిరిపోతుంటే అన్నాడు మధుమూర్తి.

న్యూ ఏవెన్యూ దగ్గిర అతన్ని డ్రాప్ చేస్తూ, గుడ్ నైట్ చెప్పి కారు బేక్ చేసింది సుజాత.

ఆ చీకట్లో చాలాసేపు అలా నిలిచి సుజాత తలపులలోనే ఉండిపోయాడు మధుమూర్తి.

* * * *

ఢిల్లీలో కాన్ఫరెన్సు అయిపోయింది. హోటల్ అశోకాలో మధుమూర్తికి, సుజాతకు రూమ్సు రిజర్వ్ చేశారు. ఆఖరి రోజు విశ్రాంతిగా రాత్రి తొమ్మిది గంటలకు హోటల్ బాల్కనీలో కూర్చు న్నారు మధుమూర్తి, సుజాత. వాతావరణం చలి చలిగా ఉంది. పల్చగా వెన్నెల పరచుకొని ఉంది. హాల్ లోంచి వెస్ట్రన్ మ్యూజిక్ మంద్రస్థాయిలో వినిపిస్తూ హాయి గొల్పుతోంది. చాలాసేపు ఆఫీసు విషయాలు మాట్లాడుకున్నారు మూర్తి, సుజాత. ఆ తర్వాత నిశ్శబ్దం ఇద్దర్నీ ఎవరి తలపులలోనికి వారిని చేర్చింది.

దూరంగా ఎటో చూస్తున్న సుజాత ఉన్నట్లుండి అంది: "ఆలోచించనంతసేపూ జీవితం చాలా అందంగా అనిపిస్తుంది. కాని నిజంగా ఆలోచించడం మొదలుపెడితే అంతా అస్తవ్యస్తంగానే కన్పిస్తుం దండి, మూర్తిగారూ!"

"కాని, సుజాతా! ఇలా జీవితాన్ని డిసెక్ట్ చేస్తూ పోతుంటే, జీవితంలో ఉండే మాధుర్యాన్నీ, ఆనం దాన్నీ చవిచూడలేమేమోనండి."

"జీవిత మనేది ఒక భ్రాంతి. ఆ భ్రాంతిలో నుండి తేరుకొని, సత్యాన్ని దర్శించాలనుకొనేంతలోనే జీవిత కాలం ముగిసిపోతుంది. ఈ రసమయ జగత్తు నుండి అనంత విశ్వంలోని ఏవేవో వలయాల లోనికి ప్రవేశిస్తూ, ఆ అలౌకిక అనుభూతులన్నీ ఆత్మ ఇముడ్చుకొంటుంటే ఆ విశ్వ సృష్టిలోని అద్భు తానికి ఉక్కిరి బిక్కిరి అవుతూ, ఆ మహాశూన్యంలో కలిసిపోతాడు మనిషి. త నసలు ఎందుకు వచ్చాడో, ఎందుకు వెళ్ళుతున్నాడో, ఎక్కడికి పోతున్నాడో తెల్సుకోలేకుండానే..." సుజాత తనలో తాను అను కున్నట్లుగా చెప్పుకొని పోతూంది.

ఆ మసక వెన్నెలలో పాల విగ్రహంలా మిసమిస లాడుతోంది సుజాత. ఆమె శరీర వర్ణంలో కలిసి పోయిన తెల్లని కంజీవరం పట్టుచీరలో నీలం జరీ బుటా పువ్వులు తెల్లని ఆకాశంలో నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. తలలో తెల్లని సన్నజాజులు, మెడలో స్వచ్ఛంగా మెరుస్తున్న సన్నని ముత్యాల హారం—భుజాల మీదుగా నిండుగా కప్పుకున్న తెల్లని పూలతో ఎంబ్రాయిడరీ చేసిన ఆకుపచ్చ రంగు షాల్—ఏ దేవతా మూర్తో దివినుండి భువికి దిగివచ్చిన ట్లనిపించింది మధుమూర్తికి. ఆమెను చూస్తుంటే ఏదో అలౌకికానందం. ఏ లోకాల్లోనికో తను కొట్టుకు పోతున్న భావన. అతని కళ్ళముందు ఎన్నో అద్భుత వలయాలు. అనేక కళా స్వరూపాలు. అతని ఎదుట కూర్చున్న ఆ సజీవ సుందర శిల్పాన్ని చిత్రిస్తూ పికాసో, రవివర్మ, దేవీప్రసాద్‌రాయ్ చౌదరి, కేతా, ఆనందమోహన్ ... ఎందరో చిత్రకారులు అతని

## ఆమె జాడలు

అరుణ వర్ణ మేఘ వితిపై
పడతిని దహనం చేసి
పశ్చిమ సరోవరాన స్నానార్థమై
క్రుంకు లిడుచున్నాడు సూర్యుడు.

నా వాంఛా స్వప్నాలు
ఆమె ముఖ దర్పణము మీద వ్రాలి
తమ రూపురేఖల చూచుకొని
సిగ్గిలుచున్నాయి.

పసిడి పలుకులు వెండి నవ్వులు
సాధించని విజయాలను
ఆమె మౌనము సాధించింది.
ఎదలోని తేట ముఖానికి ప్రాకింది
క్రొత్త వెలుగులు కళ్ళల్లో మెరిశాయి.

వికసిత వదన నవ్వు వెన్నెలలో
నా హృదయ విలాపాలను ఆరబోశాను
ముకుళిత వదనయై నిట్టూర్చి
మ్లాన నయనాలతో వెడలింది.
ప్రేమించేది ప్రేమ గాయాల తినేది
మగవాళ్ళ గుండియలే
గుండె పోటుతో చచ్చేది
మగవాళ్ళే.

ఆమె కన్యగా
తెలుగులోని అరసున్నగా ఉండేది
గృహిణిగా నిండుదనములో
లెక్కల నిండుసున్నగ గణన కెక్కింది.

ప్రకృతిలో
ఆడకన్న మగ జాతే అందంగా ఉంటుంది
సాహిత్యంలో
ఆడవాళ్ళ అందం కన్న
మగవాళ్ళ అందం దిగదుడుపు.

అందం ఆడవాళ్ళ సొమ్ము
అన్నాను నేను
మగవాళ్ళ అందం
మగవాళ్ళకు తెలియదు
అన్నది ఆమె గంభీరంగా.

ఆమె సౌందర్యములో
బ్రహ్మది సగము పాలు
పురుషుడిది సగము పాలు.

ఆమెను నుతించి నుతించి
అప్సరగా మార్చివేశారు
మగవాళ్ళ పొగడ్తలు వింటుంటే
ఆమె గుండె కడలి ఎంత పొంగుతుందో
మానవతనే మరచిపోతుంది.

—బెజవాడ గోపాలరెడ్డి

కళ్ళముందు కదిలిపోతుంటారు. ఎక్కడి నుండో అతనికి బిస్మిల్లా ఖాన్ షహనాయ్ వాద్యం వినిపిస్తున్నట్లు ఉంటుంది. ఎవరో చల్లని మంచు తుంపరలు అతని మీద చిలకరిస్తున్నట్లు ఉంటుంది. ఎప్పుడూ అదే మధురానుభూతి.

సుజాత చుట్టూ దివ్యమైన కాంతి పుంజాలు. అతను మనస్సు విప్పి చెప్పాలనుకున్న వేవీ ఆమెతో చెప్పలేడు. ఇద్దరి మధ్యా పలచని తెరలు. ఆ తెరలు తొలగించుకొని అతను ఆమెను చేరుకోలేడు. ఆమె ఇవతలికి రాదు.

మధుమూర్తిని పరిశీలిస్తున్న సుజాత "ఎర్లీ మార్నింగే కదా మన ప్రయాణం? ఉదయమే లేవాలి. ఇక రూముకు వెళ్ళి రెస్ట్ తీసుకోండి, మూర్తి గారూ." ఎంతో ఆప్యాయత నిండిన స్వరంతో అతి సహజంగా అని కుర్చీలోంచి లేచింది సుజాత.

గాలికి రేగిన ఆమె తలలోని సన్నజాజుల పరిమళం అతణ్ణి ఉక్కిరి బిక్కిరి చేసింది. అతని మన స్థితిలో అర్థమయికూడా అర్థం కానట్టు నవ్వుకుంది సుజాత.

అతనికి కళ్ళతోనే మానసిక శక్తిని కలిగిస్తూ "విష్ యు సౌండ్ స్లీప్" అని గుడ్‌నైట్ చెబుతూ తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది సుజాత.

"విష్ యూ స్వీట్ డ్రీమ్స్, మై డియర్ సుజాతా!" తనలో తాను గొణుక్కుంటూ పక్కమీదకి ఒరిగాడు మధుమూర్తి.

"సుజాతకి శారీరకమైన కోరికలు ఉండవా? వాటిని ఆమె ఎలా జయించ గలుగుతుందో? ఆమెలో ఉండే ఆ ఆత్మశక్తికి తను అప్రతిబు డవుతున్నాడు." డన్‌లప్ బెడ్ మీద దొర్లుతూ నిద్ర రాక అనుకున్నాడు మధుమూర్తి.

"తనూ సామాన్యమైన మనిషే. పరువానికి బలవంతంగా పగ్గాలేస్తుందని అతని కెలా తెలుస్తుంది?" అనుకుంది సుజాత నిద్రలోకి జారిపోతూ.

* * *

ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన వారం రోజులకే మధుమూర్తికి, పార్థసారథికి ఒకేసారి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చాయి. మధుమూర్తి సబ్‌కలెక్టరుగా ఎక్కడో గోదావరీ తీరాన ఉన్న రాజమండ్రికి, పార్థసారథి ఆవడిలో ఉన్న హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీకి అసిస్టెంట్ మేనేజరుగా వెళ్ళిపోయారు.

అక్కడికి వెళ్ళిన తరవాతనైనా మధుమూర్తి సుజాతకు తన మనసును తెలియపరచ లేకపోయాడు.

ఫలితం—త్వరలోనే మీనాక్షి అతని జీవిత భాగస్వామి అయి సర్వాధికారాలూ చేజిక్కించుకుంది. సుజాత దగ్గరినుంచి అతనికి ఉత్తరాలు వస్తున్నాయి. స్నేహపూర్వకంగా, చాలా క్లుప్తంగా వ్రాస్తోంది. ఆమె లాగే ఆమె ఉత్తరాలు కూడా చాలా సౌంద్యాగా ఉంటాయి.

మరో సంవత్సరంలో సుజాత పెండ్లికూడా అయింది. భర్త అమెరికాలోని విస్కాన్సన్ యూనివర్సిటీలో ఇండియన్ స్టడీస్ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసరుగా పని చేస్తున్నారు. సుజాత ఇండియాలోనే ఉంది. సబ్‌కలెక్టరుగా పదవి బాధ్యతలతో, ప్రొహిబిషన్ సలపని కార్యక్రమాలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ జీవితం గురించి పట్టించుకోవడానికే మధుమూర్తికి తీరిక చిక్కడం లేదు. భూభ్రమణ వేగం



పెరిగిందేమో, రెండు సంవత్సరాల కాలం ఇట్టే ముందుకు దొర్లింది.

మీనాక్షితో సాంసారిక జీవితం చాలా మెకానికల్‌గా గడుస్తున్నట్లు అనిపిస్తుంది మధుమూర్తికి. ఆమెలో ఈస్థటిక్ సెన్స్ లేదు. అతనిలో అప్పుడప్పుడు భావుకత్వం తలెత్తుతుంది. హృదయం రసానుభూతి కోసం తహతహ లాడుతుంది. అటువంటి "ఎస్థెటిక్ యాసిజమ్" సుజాత సన్నిధిలో తప్ప వేరెక్కడా లభించదని అతనికి తెలుసు.

ఈ మధ్య సంవత్సరం నుండి సుజాత నుండి ఉత్తరాలు లేవు.

* * *

ఆఫీసు నుండి వచ్చిన మధుమూర్తి హాలులో సోఫాలో కూర్చుని మాగజైన్ తిరగేస్తున్నాడు. మీనాక్షి కాఫీ ట్రే తీసుకుని వచ్చి టీపాయ్ మీద పెట్టింది. కాఫీతోపాటు గులాబ్‌జామ్, శాండ్‌విచెస్ తింటున్న అతని చేతికి షెల్ఫులో నుండి గులాబి రంగు కవరు తీసి "మీకు లెటర్ వచ్చింది" అని

## అక్షరాలు

కేక వేసి బాలు  
కేసులో పడుకున్న అమ్ములు  
నిప్పు పూలై లేసాయి.  
గుండె భారమే దారంగా  
దండలై మండుతాయి.  
కంజీరల వేళ్ళకు  
కళ్ళు మొలిచి  
ఆశలను వెతుకుతాయి.  
ఎరని స్వేదాన్ని పులుముకొని  
కాగితాల మీద  
పాద ముద్రలు వేస్తూ  
జనం గుండెల్లోకి  
నడిచిపోతాయి.

—ఎన్. గోపి

అందించి లోనికి వెళ్ళిపోయింది మీనాక్షి.

అది సుజాత ఉత్తరం. "ఒక ఫ్రెండ్ మ్యారేజికి అక్కడికి వస్తున్నాను. పంచవటిలో దిగుతాను. వీలుంటే కనిపించండి" అని వ్రాసింది. తిన్న గులాబ్‌జామ్ కంటె తియ్యగా ఉంది అతని కా వార్త.

* * *

ఆ రోజు ఆదివారం కావడం కూడ విశేషం. మధ్యాహ్నం డైనింగ్ టేబిలు దగ్గర... ఆదివారం స్పెషల్ డిషెస్. కస్టర్డ్, పాన్‌కేక్, సమోసాలు ఇష్టంగా తింటూ, "చాలా బ్రహ్మాండంగా ఉన్నాయ్, మీనా. వంటకాలు! నీ పాక కళా ప్రావీణ్యానికి నా హార్టీ కంగ్రాట్స్" అన్నాడు మధుమూర్తి.

"ఆఁ! వంట చేయడంకూడా ఒక గొప్పేనా? మరీ బడాయిగా చెబుతారు మీరు అన్నీ!" అతి తేలిగ్గా కొట్టి పారేస్తూ అంది మీనాక్షి. ఆ మాటల్లో ఉండే అందాన్నీ, అనుభూతినీ చవిచూడలేని మనిషి మీనాక్షి. ఎంత సేపూ సంసారం, సంపాదన— వాటి గురించే తప్ప దేని గురించీ ఆలోచించదు. అదే జీవిత పరమార్థం ఆమెకు.

"సుజాత ఈ ఊరు పెండ్లికి వచ్చింది. పంచవటిలో బస చేసిందట. వెళ్ళి కన్పించి రావాలి." మీనాక్షిని పరిశీలనగా చూస్తూ అన్నాడు మధుమూర్తి.

"ఆఫీసర్ల కేమిటి? ఎక్కడైనా బస చేస్తారు. ఒక బందల అంటూ ఉంటేగా. ఎలా తిరిగినా ఫర్వాలేదు." తన సహజ ధోరణిలో అంది డైనింగ్ టేబులుమీది ప్లేట్లు సర్దుతూ. పర్పుల్ క్రీమ్, కమలా హనీ, ఫ్రూట్ సలాడ్ తయారు చేసింది లాగుంది, వెస్సెల్సులో పోసి మధ్యాహ్నం వచ్చే గెస్టులకోసమని ఫ్రిజ్‌లో పెడుతోంది. తన పనిలో తాను నిమగ్నమై ఉంది. కనీసం మాటవరసకైనా "ఆమెను రమ్మని పిలవండి" అని అనలేదు. చేయి కడుక్కుని, టేబిలు దగ్గరినుండి లేచి తన గదికి వెళ్ళిపోయాడు మధుమూర్తి.

సుజాతకి సైగల్ రికార్డులన్నా ... రవిశంకర్ సితార్ వాద్యం అన్నా చాలా ఇష్టం. సైగల్ రికార్డులు సాయంత్రం తీసుకొని వెళ్ళాలి. ఈజీ చైర్‌లో వాలి విశ్రాంతి తీసుకుంటూ అనుకున్నాడు మధుమూర్తి.

* * *

సాయంత్రం సూర్యుడు గోదావరిలోకి జారుకుంటున్నాడు. ఆకాశమంతా అరుణ వర్ణం అలుముకుంది. నదిమీదనుండి చల్లని గాలులు వీస్తూ వేసవి తాపాన్ని పోగొడుతున్నాయి. వాతావరణం మనస్సుకి ఆహ్లాదకరంగా ఉంది. క్రమంగా చీకట్లు ముసురుతూ ప్రకృతికి గాంభీర్యాన్నిస్తున్నాయి. ఆ నల్లని చీకటిలో ... మౌనంగా గోదావరి ... ఒడ్డున దీప తోరణాలు... ఆ వెలుగు నీడలు కెరటాలమీద పడి ప్రతిఫలించి గోదావరి నది తళ తళా మెరుస్తున్నది.

పంచవటి రూఫ్ గార్డెన్‌లో బాల్కనీ గోడ ప్రక్కగా కూర్చున్న సుజాతా మధుమూర్తులకు ఆ దృశ్యం చాలా మనోహరంగా కన్పిస్తున్నది. వారిద్దరి మధ్యా భావ పరిమళం అగరుబత్తుల గుబా

## వచ్చే సంచిక నుండి
## కొత్త సీరియల్ ప్రారంభం
# పసిడి కిరణాలు
### రచన: ఎ. శ్యామలారాణి

శంపుంతో ఘుమ ఘుమ లాడుతూంది. మునుపుగా సుజాతే వివాహాక్తిని గురించి చాలా ఆప్యాయంగా అడిగింది—"ఆమెను కూడా తీసుకురాకపోయారా?" అని. రాగద్వేషాలకు అతీతురాలయిన సుజాతకు మనస్సులోనే అంజలి ఘటించాడు మధుమూర్తి.

ఇప్పుడైనా తన మనస్సులో ఆమెను గురించి ఏమనుకుంటున్నాడో, ఆమెకు తన హృదయంలో ఉన్న స్థానం ఏమిటో చెప్పాలనుకున్నాడు. కాని చెప్పలేదు.

మరలా అదే అనుభూతి ... అదే భావం. అతనేవో లోకాల్లోకి వెళ్ళిపోతున్నాడు. ఎటునుండో తీయని స్వరాలు పలుకుతూ... అతని హృదయ వీణను మీటుతుంటాయి. అతనిలోని కళాకారుడు నిద్ర లేస్తాడు. అతని కళ్ళముందు త్యాగరాజు, పురంధరదాసు, పినాకపాణి, బాలమురళీ కృష్ణ— సంగీత స్వరాలతో లయ విన్యాసాలు పల్కుతుంటారు. సిద్ధేంద్రయోగులు, నటరాజ రామకృష్ణ, వెంపటి చిన సత్యం, కోరాడ నరసింహారావు, యామినీ కృష్ణమూర్తి, యడవల్లి రమ, గోపీకృష్ణ, ఉదయ శంకర్ అనేక నృత్య భంగిమలతో అతని ముందు తాండవిస్తుంటారు. అదంతా ఒక రసమయ లోకం. ఆ లోకంనుండి ఇవతలకు వచ్చేటప్పటికి ఎదురుగా సుజాత!!

గులాబీరంగు ధర్మవరం పట్టుచీర—అదే రంగు జాకెట్టు. చేతులకు గులాబీరంగు గాజులు. తలలో కనకాంబరాల మాల. నుదుట ఎర్రని కుంకుమ. అరుణ కాంతులతో వెలుగొందుతూంది సుజాత.

"మూర్తీ! ఈమధ్య పాండిచ్చేరి వెళ్ళాను. అక్కడ అరవిందాశ్రమంలో ఆ గులాబీ తోటలమధ్య జీవితం ఎంత ప్రశాంతంగా ఉంటుందో నీకెలా చెప్పగలను! ఆ ఆధ్యాత్మిక వాతావరణంలో మనస్సు ఎంతో ఆహ్లాదకరంగా ఉండి, ఏదో అలౌకికానందంలో తేలిపోతున్నట్లు, మరో లోకంలో జీవిస్తున్నట్లు అన్పిస్తుంది మనకు! ఎప్పటికైనా జీవితం అలాంటి చోటనే ముగియాలి" అంది సుజాత.

ఆ సౌందర్య దీపాన్ని అలా చూస్తుంటే ఆరాధనతోపాటు అతనిలో ఏవో బలహీనతలు కూడా తలఎత్తుతున్నాయి. ఇప్పుడైనా తన ప్రేమను ఆరాధనను ఆమెకు తెలియజేయాలి. ఆమెలో తను లీనమైపోవాలి. అతని ఆత్మ ఘోషిస్తూంది. కాని ఏమీ చెప్పలేదు. ఆమెలో కలిసిపోలేదు. ఆమెలో ఉండే ఆ జ్ఞాన తేజస్సుకు అతనిలో ఉండే బలహీనతలు మాడి కరిగిపోతున్నాయి. ఇద్దరు వ్యక్తుల్లో ఏ ఒక్కరు హృదయౌన్నత్యం కలిగి ఉన్నా... రెండవ వ్యక్తిని బలహీనతా గుండంనుండి ఒడ్డుకు పడవేయగలరు.

సుజాత వెళ్ళిపోయింది.

* * *

వెళ్ళిన కొంత కాలానికి సుజాతకు చాలా దూరంగా సబ్ కలెక్టరుగా ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ తర్వాత ఆమె దగ్గరనుండి ఉత్తరాలు పూర్తిగా నిలిచి పోయాయి మధుమూర్తికి.

మధుమూర్తి జీవితంలో ఉన్న 'థ్రిల్' అంతా పోయింది. అంతా రొటీన్ లైఫ్. అతి నిస్సారంగా... అతి సామాన్యంగా ఎన్నో సంవత్సరాలు కాలవాహినిలో కలిసిపోయాయి. ఎటు చూసినా వెలితి. ఏ విధమయిన ప్రత్యేకతా లేని గమనం. మనసుకు ప్రాధాన్యం లేని జీవితం. ఆలోచనలకు విలువ, అవసరంలేని సాంఘిక వాతావరణం! అంతటి జీవిత సంరంభంలో...అంతు లేని స్తబ్దత! అతని గుండెల్లో ఏదో అసంతృప్తి! ఆవేదన!

అతనికి అప్పుడప్పుడు హైదరాబాద్‌లో గడిపిన రోజులు గుర్తుకు వస్తుంటాయి. జగన్మోహనరావు గారు రిటైరై హైదరాబాద్‌లోనే సెటిల్ అయ్యారు. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసేది ఆయనే. ఆయన ఉత్తరం వచ్చినప్పుడల్లా జగదీష్, సుభాని, వెంకటరాఘవన్ అందరిని గురించీ ఆలోచిస్తుంటాడు మధుమూర్తి. రచయితగా వాళ్ళ జీవితాలను తీర్చి, ఊహల్లో రూపురేఖలు దిద్దుతుంటాడు. తనకు నచ్చిన రీతుల్లో వాళ్ళ కథల్ని ముగిస్తుంటాడు. అందరి కథల్ని ముగించాడు కాని, సుజాత కథనే ముగించలేకపోయాడు. "అయినా ఏమని ముగించాలి?—సుజాత భర్త దగ్గరికి ఫారిన్ చేరుకుంటుంది అనా? లేదా—ఆమె ప్రయాణం చేస్తున్న విమానం మధ్యలో కూలిపోతుంది. ఆమె కథ శాశ్వతంగా ముగుస్తుంది అనా? ఛ! ఛ! అలా పిచ్చి పిచ్చిగా సుజాత కథ ముగియకూడదు. అలా ముగించాలనీ లేదు. అయినా తన కెందుకు ఇటువంటి ఆలోచనలు వస్తుంటాయి అప్పుడప్పుడు?" అను కుంటాడు మధుమూర్తి.

కథకి ముగింపు లేకుండానే చాలా కాలం గడచి పోయింది.

* * * *

అరబ్ ఎమిరేట్సు నుండి తన బావమరిది వస్తుంటే బొంబాయి వెళ్ళాడు మధుమూర్తి. 'సన్ ఎండ్ శాండ్' హొటలునుండి శాంతా క్రుజుకు వస్తుంటే అనుకోకుండా మధ్యలో సుభాని కన్పించాడు. చాలా విషయాలు మాట్లాడుకున్న తరువాత సుజాత ప్రస్తావన వచ్చింది. "సుజాత ఇంకా ఇండియాలోనే ఉంది. భర్త ఆహ్వానం కోసం ఎదురుచూస్తున్న ఆమెకు అతను విడాకులిచ్చి, అక్కడే ఒక నీగ్రో వనితను వివాహం చేసుకున్నాడు. సుజాత కేరళలో ఉంటున్నది." సుభాని ఊహించ లేని నిజాన్ని చెప్పి మధుమూర్తిని ఖిన్నుడ్ని చేశాడు.

ఆ మాటతో అతనికి హృదయంలో తుఫాను చెలరేగింది. సుజాత అడ్రసు అడిగి ఆమెకు ఉత్తరం వ్రాయాలని కూడా తట్టలేదు. సుజాత తనను పూర్తిగా మరిచిపోయి ఉంటుంది. కాని తను సుజాతను ఎన్నటికీ మరువలేదు.

బిడ్డలు ఎదిగి వస్తున్నారు. తల నెరిసిపోతుంది. కాలం గిరగిరా తిరుగుతుంది. అతనిలో నిస్తేజం మాత్రం అలానే ఉంది.

* * *

చాలా కాలం తర్వాత ఒక మారుమూల రాష్ట్రంలో పని చేస్తూ మధుమూర్తి ప్రాజెక్టు ఆఫీసరుతోబాటు ఒక సారి కొండ ప్రాంతంలో ఉన్న ఒక కుగ్రామానికి స్కీమును అమలు జరిపే నిమిత్తం కేంపుకు వెళ్ళాడు.

అతణ్ణి దిగ్భ్రాంతుణ్ణి చేస్తూ అక్కడ సుజాత కన్పించింది! అతను చూస్తున్నది సుజాతను అరవిందాశ్రమంలో గులాబీ తోటల మధ్య కాదు. అతి మారుమూల కుగ్రామంలో గిరిజనుల మధ్య. "మదర్ థెరెసాలా ప్రజాసేవలో నా జీవితం ధన్యమవడం నా కిష్టముండి, మూర్తీ!" ఒకప్పుడు ఆమె లవలో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి అతనికి.

ఎప్పటిలా ఆమె పెదవులపై స్నిగ్ధమైన దరహాసం—ఆ కొండ కోనలలో కారుచీకట్ల మధ్య ఒక కాంతి కిరణం ప్రకాశిస్తూంది. ✱

